


మిస్‌వరల్డ్ పోటీలు చూడాటానికి వచ్చిన సోనూసూద్‌కు శంషాబాద్ రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్టులో స్వాగతం పలుకుతున్న దృశ్యం



హైదరాబాద్ వార్త

# ఖానామెట్ భూములను కాపాడేదెవరు?

- వందల కోట్ల భూమిపై వాలిన రాబందులు!
- అనుమతులిచ్చి మరీ అప్పగిస్తున్న జీహెచ్ఎంసి
- నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్న రెవెన్యూ
- హైడ్రాకూ తెలుసని రంకెలేస్తున్న అక్రమార్కులు
- గజం రూ.3లక్షల ప్రభుత్వ భూమి గద్దలపాలేనా?

సైబరాబాద్ ప్రతినిధి, మే 6 ప్రభాతవార్త

**హైటెక్‌సిటీ నుంచి హెచ్ఐసిసికి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొనివున్న ఆ స్థలం గజం విలువ అక్షరాల మూడు లక్షలకు ఏమాత్రం తగ్గదు.. ప్రతినిత్యం వివిఐపిలు సంచరించే ప్రధాన రహదారిపైనే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని భారీ వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నా కాపాడేవారు కరువయ్యారు.. అధికారుల అవినీతిని ఆసరాగా చేసుకొని ఒకటికాదు రెండు కాదు ఏక కాలంలో ప్రభుత్వ భూమిలో పలు అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.. పత్రికల్లో ఎన్ని కథనాలు వెలువడ్డా ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు అందినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న వైనంపై ప్రభాతవార్త మరో ప్రత్యేక కథనం..**

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వేనెంబరు 41లో 250 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో దాదాపు 70 ఎకరాల భూమిని 41/1 నుంచి 41/13 వరకు బైనెంబర్లుగా విభజించి గతంలో ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు వ్యవసాయం చేసుకొని జీవించే నిమిత్తం అసైన్ చేసింది. మిగతా 180 ఎకరాల భూమి 41/14 సర్వేనెంబరు పేరిట ప్రభుత్వం చేతిలోనే ఉండగా గత ప్రభుత ్వం ఈభూమిని ఎడాపెడా విక్రయించడంతోపాటు మరో పదెకరాల ను రెండు కుల సంఘాలకు అప్పగించింది. అత్యంత



హైటెక్‌సిటీ-హెచ్ఐసిసి ప్రధాన రహదారిని ఆనుకొని అసైన్‌మెంట్ భూమిలో అక్రమంగా వెలసిన భారీ వ్యాపార భవనం

ప్రతిష్టాత్మ కమైన హైటెక్‌సిటీ, హెచ్ఐసిసికి మధ్యలోవున్న ఈభూమి నగరంలోనే అత్యంత విలువైనదికాగా కొందరు భూ బకాసురులు అక్రమ మార్గంలో నిర్మాణ అనుమతులు పొంది అందినకాడికి దండుకోవడం మొద లుపెట్టారు. ఈ విషయమై గతంలో పలు కథనాలు వెలువరించిన 'వార్త' దినపత్రిక ఏడాదిక్రితం 'ఖానామెట్ భూములు ఖతం' అనే శీర్షికతో వరుస కథనాలు వెలువరించగా చందానగర్ మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ భవనాల కూల్చివేతలు చేపట్టారు. హడావుడిగా కూల్చివేతలు చేపట్టినా ఆతర్వాత ఆజమాయిషీ కరువ వడంతో యధావిధిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. జిహెచ్ఎంసి అధికారులకు లంచాలిచ్చి ఖానామెట్ ప్రభుత్వ, అసైం డు భూముల్లో అక్రమ అనుమతులు పొంది ఇండ్లు నిర్మిస్తుండగా నిలువరించాల్సిన రెవెన్యూ అధికారులు కేవలం నోటీసులు జారీచేసి పనివొత్తిడంటూ ఆతర్వాత అటువైపు చూడటంలేదు.

**అన్నీ అక్రమాలే..**

పేదల జీవనోపాధికోసం ఇచ్చిన అసైండు భూమిని తమ వారసులకు అప్పగించడం తప్ప ఇతరులకు విక్రయించినా, అందులో ఏదైనా నిర్మాణం చేపట్టినా నిబంధనల ప్రకారం ఆ భూమిని కోల్పోవాల్సి వుంటుంది. అయితే ఇక్కడ ప్రభుత్వ నిబంధనలు అన్నింటినీ తుంగలో తొక్కి ఖానామెట్ 41/12, 41/13 సర్వేనెంబర్లలోని 533 గజాల అసైండు భూమిని నిబంధనలకు విరుద్ధంగా అనుమతిలేని వెంచర్‌లోని ప్లాట్ల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మరో 140 గజాల భూమికి కేవలం నోటరీ సహాయంతో అక్రమంగా చందానగర్ సర్కిల్ నుంచి ప్రాపర్టీ టాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (పిటిఐఎన్-1129963456)పొందారు. దీని ద్వారా హౌజ్ నెంబర్ 2-31/8/ఎ/8/1 తీసుకొని దాని సహాయంతో సేల్‌డీడ్(6254/2020) చేసుకున్నారు. ఈ సర్వేనెంబరు నిషేధిత జాబితాలో ఉన్నా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరగడం గమనార్హం. కేవలం ఒక సంవత్సరం మాత్రమే ప్రాపర్టీ టాక్స్ చెల్లించిన అక్రమార్కులు తమకు కావాల్సిన సేల్‌డీడ్ దక్కడంతో ఆతర్వాత జిహెచ్ఎంసికి కూడా పంగనామం పెట్టారు. అనంతరం 2023 డిసెంబరులో శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం నుంచి ఐదు అంతస్తులకు పర్మిట్ నెంబర్ (4858/జిహెచ్ఎంసి/ ఎస్ఎల్‌పి/2023) ద్వారా నివాస భవనం అనుమతులు పొందారు. కనీసం తాము తీసుకున్న అనుమతి ప్రకారమైనా భవనం నిర్మించారా అంటే అనుమతికి సంబంధమే లేకుండా పూర్తిగా అక్రమ నిర్మాణం చేపట్టారు. సెట్‌బ్యాక్ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండా అక్రమంగా సెల్లార్ కూడా తీసి పూర్తిగా వ్యాపార సముదాయాన్ని లక్షలాది రూపాయల అద్దెలు దోచుకునేందుకు రెడీ అయ్యారు.

**అనుమతుల రద్దు ఎప్పుడు..?**

అసైండు భూమిలోని ఈ భవన నిర్మాణంలో జరిగిన అక్రమాలను ఎత్తిచూపుతూ పర్మిషన్‌ను రద్దుచేసి భవనాన్ని సీజ్ చేయాల్సిందిగా స్థానికంగా నివాసముండే ఓ వ్యక్తి పది నెలల క్రితమే చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. షోకాజ్ నోటీస్, స్పీకింగ్ ఆర్డర్ జారీ చేయడం ద్వారా అనుమతుల వద్ద నుంచి భవన నిర్మాణం వరకు జరిగిన అన్ని అక్రమాలను గుర్తించిన డిప్యూటీ కమిషనర్ వెంటనే ఇంటి నెంబర్‌ను రద్దు చేశారు. కాగా జోనల్ కార్యాలయం నుంచి పర్మిషన్ పొందిన కారణంగా ఎలాంటి చర్య అయినా అక్కడి అధికారులే తీసుకోవాలని చెప్తూ ఇదే విషయాన్ని లెటర్ నెం.(1195/టిపిఎస్/సి21/ఎస్ఎల్‌పి/జిహెచ్ఎంసి/2024) ద్వారా జోనల్ కమిషనర్‌కు తెలియపర్చారు. దాదాపు 20కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలోని ఈభవనం అనుమతులు రద్దు చేయడంతోపాటు అక్రమంగా పొందిన సేల్‌డీడ్ విషయమై జిల్లా రిజిస్ట్రార్‌కు తెలియపర్చాల్సిన బాధ్యతలోవున్న జోనల్ అధికారులు గత ఐదు నెలలుగా మీనమేషాలు లెక్కిస్తున్న విషయం గమనార్హం. అసైండు భూమిలో అక్రమంగా జరుగుతున్న సేల్‌డీడ్‌లను రద్దు చేయించి భూమిని స్వాధీనం చేసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు సైతం తమ బాధ్యత కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**కూల్చివేతలు చేపడుతాం: డిప్యూటీ కలెక్టర్**

ఖానామెట్ సర్వేనెంబరు 41/12,13లలో నిబంధనలకు విరుద్ధంగా అసైండు భూమిలో నిర్మాణాలు చేపడుతున్న విషయం నిజమేనని తమవద్ద పరిమిత వనరులు ఉన్న కారణంగా పూర్తి స్థాయిలో కూల్చివేతలు నిర్వహించలేకపోతున్నామని శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ వెంకారెడ్డి వివరణ ఇచ్చారు. కొందరు ఆక్రమణదారులు తాము నోటీసులు ఇవ్వకుండానే ముందస్తుగా కోర్టుల నుంచి నాట్‌టూ ఇంటర్ ఫియర్ ఆర్డర్లు పొందుతున్నారని, సమయాభావం కారణంగా సద రు ఆర్డర్లను వెకేట్ చేయించలేకపోతున్నామని తెలిపారు. అసైండు భూముల్లో ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు.

**హైడ్రా అధికారులకూ తెలుసట..!**

ఇదే తరహాలో ఇక్కడ నిర్మాణాలు చేపడుతున్న మరికొంతమంది అక్రమార్కులు తమ స్థలాన్ని హైడ్రా అధికారులు ఇప్పటికే సందర్శించి వెళ్లారని, తమ తప్పు ఉంటే వారు చర్యలు తీసుకోరా? అని బాహాటంగా చెప్పుకుంటూ అక్రమ నిర్మాణాల్లోని ఫ్లాట్లను అమాయకులకు అంటగడుతున్నారు. హైటెక్‌సిటీ చెంత వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తున్న రియల్ మాఫియాపై హైడ్రా అధికారులైనా చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## భూసేకరణ లేని ప్రాంతంలో నాలా పనులు ప్రారంభించండి

**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశం**



కూకట్‌పల్లిలో పర్యటిస్తున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ తదితరులు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త:

వర్షాకాలం దగ్గర పడినందున భూసేకరణ లేని ప్రాంతంలో నాలా పనులు ప్రారంభించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కూకట్ పల్లి జోన్ లోని మూసాపేట్, గాజులరామారం, కూకట్ పల్లి సర్కిళ్లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కమీషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మూసాపేట్ మెట్రో స్టేషన్ వద్ద వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ ను పరిశీలించారు. అదే విధంగా ఐడిపిఎల్ చెరువు సర్ ప్లస్ నాలా ఆర్టిసి డిపో వరకు గల ఎస్.ఎన్.డి.పి నిధులతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. భూసేకరణ వల్ల పనులు ప్రారంభించలేక పోవడం జరిగిందని అధికారులు వివరించడంతో వర్షాకాల దగ్గర పడుతున్న నేపథ్యంలో వరద నీరు వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కైతలాపూర్ రోడ్డు వెడల్పు పనులకు సంబంధించిన పరిశీలన చేసి జాప్యానికి గల కారణాలను ఇంజనీర్ ను వివరణ కోరగా కోర్టు కేసు ఉన్న నేపథ్యంలో పనులు స్టార్ట్ కాలేదని చెప్పడంతో కౌంటర్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే కైలాస వారం హిందూ గ్రేవ్ యార్డ్ నిర్వహణ ఆరా తీశారు. దాని పక్కనే ఉన్న అనిమల్ కేర్ సెంటర్‌ను సందర్శించి కుక్కల ఆపరేషన్ సెంటర్ గదిని పరిశీలించారు. కుక్కలను ఆపరేషన్ చేసిన తర్వాత ఆపరేషన్ చేసిన కుక్కలను గుర్తించడం ఎలా అని కమిషనర్ వివరణ కోరగా కుక్క చెవిని కట్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే జే ఎన్ టి యు కు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడ నుండి టియస్ఐఐ (షాపూర్) లో మల్టీ పర్పస్ ఫంక్షన్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అన్నారు. బిల్డింగ్ ఏరియా, వివరాలను ఈఈ వివరించారు. గ్రౌండ్ ఫ్లోర్ కుకింగ్, డైనింగ్ హాల్, ఫస్ట్ ఫ్లోర్ సెకండ్ ఫ్లోర్ లు కూడా నిర్మాణాలు పూర్తి చేసినట్లు కమిషనర్ కు వివరించారు. డైనింగ్, కుకింగ్ గదిలో షాబాద్ బండలు వేయాలని సూచించారు. సూరారం వాటర్ స్టాగ్నేషన్ పరిశీలించారు. గాజులరామారంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిశీలించారు. ఏఏ క్రీడలు నిర్వహిస్తారని కమీషనర్ అడిగారు. క్రికెట్, బ్యాడ్మింటన్ ఆటలకు అనుకూలంగా ప్లే గ్రౌండ్ ఉందని, వాలి బాల్ కోసం కూడా ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అర్బన్ ఫారెస్ట్ పార్కు ను సందర్శించారు.కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ అపూర్వ్ చౌహన్, జోనల్‌ఎస్ఈ చిన్నా రెడ్డి, ఈఈలు రమేష్, శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో సిఎండీ ముషారఫ్ సుడిగాలి పర్యటన

**-మిస్‌వరల్డ్ పోటీల ఏర్పాట్లపై పరిశీలన**

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త:

రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 72వ మిస్ వరల్డ్ అందాల పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ తగు ఏర్పాట్లు చేసిందని పోటీలు నిర్వహించే ప్రాంతాలతో పాటు, అతిధులు పర్యటించే పర్యాటక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు దాదాపు 20 ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేపట్టిన ట్లు సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈమేరకు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. మిస్ వరల్డ్ నిర్వహించే ప్రాంతాలు, చారిత్రాత్మక పర్యాటక ప్రాంతాలైన చౌ మొహల్లా ప్యాలెస్, చార్ మినార్, గచ్చిబౌలి ఇన్ డోర్ స్టేడియం, హైటెక్స్ ఇతర ప్రాంతాల్లో పర్యటించి తమ సంస్థ చేపడుతున్న ప్రత్యేక ఏర్పాట్లను సమీక్షించారు. హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి ఈవెంట్ మిస్వరల్డ్ కు ప్రపంచ నలుమూలల నుండి భారీ సంఖ్యలో అతిధులు వస్తారని విద్యుత్ అధికారులు, సిబ్బంది అనునిత్యం మరింత అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో సీఎండీతో పాటు మెట్రో చీఫ్ ఇంజినీర్ చక్రపాణి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు సోమి రెడ్డి,చంద్ర శేఖర్ డివిజనల్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహించే ప్రాంతాల్లో పర్యటిస్తున్న సిఎండీ ముషారఫ్ ఫరూఖీ తదితరులు

## హైడ్రా చొరవతో రహదారికి మోక్షం

**-రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేసిన అధికారులు**



**అత్తాపూర్ మే 6,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్‌దేవ్ పల్లి ఇందిరాగాంధీ హౌజింగ్ సొసైటికి వెళ్లే రహదారికి మోక్షం లభించింది. రహదారిన్ని ఓ కంపెనీ యజమాన్యం అక్రమించి కొన్ని సంవత్సరాలుగా రోడ్డు మూసివేయడంతో స్థానిక ఇందిరాగాంధీ హౌజింగ్ సొసైటీ సభ్యులు తమ కాలనీకి వెళ్లేందుకు రోడ్డు తేరపించాలని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు.మంగళవారం హైడ్రా కమిషనర్ స్పందించి హైడ్రా ఇన్స్‌పెక్టర్ తిరుమల్లేష్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధి హౌజింగ్ సొసైటీకి వెళ్లే రహదారిలో నిర్మించిన షెడ్లు, ప్రహరీగోడలను పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు.ఈ మేరకు ఓ కంపెనీ వ్యక్తి తమకు సంబంధించిన భూమి అన్ని హైడ్రా అధికారులతో గోడవకు దిగారు.దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇందిరాగాంధీ హౌజింగ్ సొసైటీ వెళ్లే రహదారి పనులను త్వరగా పూర్తి చేసి రోడ్డు వేయాలని అధికారులకు ఇన్స్‌పెక్టర్ సూచించారు. అనంతరం సొసైటీ సభ్యులు మాట్లాడుతూ...గత కొన్ని సంవత్సరాలుగా తమ కాలనీకి రోడ్డు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత ప్రభుత్వాలను కూడా కోరడ జరిగిందని ఎలాంటి స్పందన లభించలేదని వాపోయారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చక సిఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రాలో ఫిర్యాదు చేయడం జరిగిందని కమిషనర్ రంగనాథ్ వెంటనే స్పందించి రోడ్డు సమస్యలను తీర్చాడని తెలిపారు.సిఎం రేవంత్ రెడ్డి,కమిషనర్‌కు ప్రత్యేక కృజ్ఞతలు తెలిపారు.

**తాము చాలా సంవత్సరాలుగా ఉంటున్నాం**

**: కంపెనీ యాజమాని మురారి**

1987లోనే ఈ ల్యాండ్‌ను కొనుగోలు చేశామని అప్పటి నుండి డెవలప్‌మెంట్ చేసుకొని తమ కంపెనీలను స్థాపించుకొనే నడిపించుకుంటున్నామని ఇప్పుడు హైడ్రా అధికారులు వచ్చి కూల్చివేయడం సరైందని కాదని కంపెనీ యాజమాని మురారి వాపోయారు.తాము ఇందిరాగాంధీ హౌజింగ్ సొసైటీకి వెళ్లేందుకు దారి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తామతో మాట్లాడాకుండా అధికారులు కూల్చివేతలు చేపట్టారని తాము ఏమైనా ఉంటే కోర్డులో తేల్చుకుంటామని అన్నారు.హైడ్రా అధికారుల తీరు ఎంతో ఇబ్బంది కలుగుతుందని వాస్తవాల తెలుసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు.

# నగరంలో నేడు మాక్ డ్రిల్స్

**-పౌరులకు శిక్షణ..భద్రతా చర్యలపై అవగాహన**

**-ప్రజల అప్రమత్తత కోసం కీలక చర్యలు**

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త :** పహల్గామ్ ఘటనతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్తాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అత్యవ సర సమయాల్లో ఎలా స్పందించాలనే దానిపై పౌరులను సమా యత్తం చేసేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెండోవ జాబితాలో ఉన్న హైదరాబాద్ నగరంలో బుధవారం సాయంత్రం 4.15 గంటల కు మాక్ డ్రిల్ నిర్వహించనున్నాయి. సికింద్రాబాద్, గోల్కొండ డిఫెన్స్ బృందాలు, కంచన్‌బాగ్ డిఆర్‌డిఎ, మౌలాలి ఎన్ఎఫ్‌సిలో మాక్ డ్రిల్ జరగనుందని అధికారులు ప్రకటించారు. పోలీసులు,ఫైర్, ఎస్డీఆర్ ఎఫ్, వైద్య, రెవెన్యూ, స్థానిక అధికారులు ఆయా ప్రాంతాలకు చేరుకుంటారు.ఈ మాక్ డ్రిల్‌లో 12 సివిల్ డిఫెన్స్ సర్వీసులు పాల్గొననున్నాయి. ఇందులో భాగంగా నగరమంతా సైరన్లు మోగించనున్నారు. అన్ని కూడళ్లలో రెండు నిమిషాల పాటు సైరన్‌లు మోగనున్నాయి. సైరన్ రాగానే ఎలక్ట్రికల్ పరికరాలు, లైట్లు, స్టవ్‌లు ఆపాలని అధికారులు సూచించారు. ఈ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలను అప్రమత్తం చేయడం, విపత్కర పరిస్థితుల్లో స్పందించే విధానంపై శిక్షణ ఇవ్వడం, సంబంధిత శాఖల సమన్వయాన్ని పరీక్షించడం. అత్యవసర పరిస్థితుల్లో ఆందోళనకు గురికాకుండా మనోధైర్యాన్ని ఎలా నిలుపుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు.

**-ఎయిర్ రైడ్ సైరన్‌లు..**

ప్రజలను అప్రమత్తం చేసేందుకు నగర వ్యాప్తంగా ఎయిర్ రైడ్ సైరన్‌లు మోగించబడతాయి. సైరన్ వినగానే ప్రజలంద రూ వైమానిక దాడుల నుండి తమను తాము రక్షించుకోవడానికి ముందే



గుర్తించిన సురక్షిత ప్రదేశాలకు వెంటనే చేరుకోవాలి.

**క్రాష్ బ్లాక్ ఔట్స్...**

మాక్ డ్రిల్‌లో భాగంగా నగరంలో సంపూర్ణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వైమానిక దాడుల సమయంలో శత్రువులు నగరాలను గుర్తించకుండా ఉండేందుకు ఈ వ్యూహం అమలు చేయబడుతుంది. భారతదేశం 1971 యుద్ధ సమయంలో కూ డా బ్లాక్ అవుట్ వ్యూహాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంది.

**కీలక సంస్థలు, ప్రాజెక్టుల రక్షణ..**

కమ్యూనికేషన్ టవర్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక ప్రాంతాలు (మిలిటరీ ఏరియాస్) వంటి ముఖ్యమైన సంస్థలు, ప్రాజెక్టులను గుర్తించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్య లు తీసుకోబడతాయి.

**తరలింపు చర్యలు...**

ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు తరలిస్తారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా తరలింపు ప్రక్రియలో పట్టే సమయం, లాజిస్టికన సమస్యలను గుర్తించి, వాటిని మెరుగుపరచడానికి ప్రయత్నిస్తారు.

**పౌరులకు శిక్షణ...**

పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సెంటర్లలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడతాయి.

## రసరమ్యం నేత్రపర్వం శ్రీచక్ర అన్నమయ్య శబ్దతరంగవల్లి

**రవీంద్రభారతి, మే 6 ప్రభాతవార్త :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్రీచక్ర మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ ప్రఖ్యాత నాట్యగురువు డా. నళిని రామారావు శిష్యబృందం అన్నమయ్య శబ్దతరంగవల్లి నృత్య నీరాజనానికి రవీంద్రభారతి ప్రధాన మందిరం వేదికైంది. వందలాదిమంది శిష్య కళాకారులు తమ అత్యంత అద్భుత రసరమ్య నేత్రపర్వ నవసరభరిత నాట్యవిన్యాసాన్ని తాండవ నృత్యకరి; నవరసములది నళినాక్షి; కృష్ణం కలయిసఖి సుందరం; గోవింద గోవిందయని కొలువరే; అయిగిరి నందిని; పాలనేత్రవల; తిరుతిరు జవరాల తదితర పలు అంశాలను శృతి లయబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శిస్తూ విచ్చేసిన అశేష కళాప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను ఆధ్యాత్మిక లోకంలో పయనింపజేసి మంత్రముగ్ధులను చేసి హర్షధ్వానాల మధ్య ప్రశంసలందుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యఅతిథులు ఆయా ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఎంతగానో అభినందించి నాట్యగురువు డా. నళిని కళాసేవలను కొనియాడుతూ శుభాభినందనలు తెలిపారు.



కళాకారుల అన్నమయ్య శబ్దతరంగవల్లిలో దృశ్యాలు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

**-సి సెక్షన్ డెలివరీలను తగ్గించాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, డాక్టర్ రాజేంద్రనాథ్ తదితరులు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసూతి సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ఇతర చికిత్సలపై ఆస్పత్రిలోకి వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసుపత్రుల పనితీరు, సాధారణ ప్రసవాలు, నీటి కొరతలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిసిఎస్‌హెచ్ డాక్టర్ రాజేంద్ర నాథ్ కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలతోపాటు, ప్రసూతి సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే ఇతర చికిత్సలకై ఆసుపత్రులకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందాలని ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని నెలలో 967 ప్రసవాలు జరిగాయని, అందులో 40 శాతం సిసెక్షన్‌లుగా ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రసవాల సంఖ్యను పెంచాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా సిసెక్షన్ డెలివెరీలను తగ్గించినందుకు కింగ్ కోటి ఆసుపత్రిని అలాగే బార్కాస్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులను అభినందించారు. అలాగే, వర్షా కాలం ను దృష్టి లో పెట్టుకుని ఆసుపత్రులలోని ఇంకుడు గుంతలు సరైన పరిస్థితిలో ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్లు సమర్థవంతంగా వారి విధులను నిర్వహించాలని సూచిస్తూ జిల్లా యంత్రాంగం తమ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూప్ ద్వారా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏరియా ఆసుపత్రిలో సూపర్డెంట్లు, కమ్యూనిటీ సెంటర్ల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం


కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న స్థానిక భక్తులు.

**మెహిదీపట్నం, మే 6, ప్రభాతవార్త:** శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ లోని శ్రీ పంచముఖ బ్రహ్మ దేవాలయంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయంలో మొదటి రోజు కలశ పూజ, గణేశ పూజ, అంకురార్పణ, ధ్వజారోహణం, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి అష్టోత్తర శతనామావలి సహిత హృదయ పుష్పాంజలి, కళ్యాణం, ప్రసాద వితరణ, ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఆరాధన మహోత్సవాలలో స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నామని రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల భాస్కర్, సలహాదారులు ఆర్ ప్రేమ చారి, ట్రెజరర్ లు ఆర్.రమేష్ చారి, అనంత చారి లతో పాటు స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆటో వాళ్లతో కార్పొరేటర్ ముఖాముఖీ


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి

**సంజీవరెడ్డి నగర్ మే 6 ప్రభాతవార్త:** సనత్ నగర్ వెల్ఫేర్ గ్రౌండ్ లో ఏ ఎంఎం హెచ్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి గార్బేజ్ ఆటో వాళ్లతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని కాలనీలలో చెత్తను సరిగ్గా తీయడం లేదని, సమయం పాటించడం లేదని రెండు, మూడు రోజులకు చెత్త చాలా అవుతుందని, అనేక రకాల వ్యాధులకు గురౌతున్నామని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి రోజు గార్బేజ్ వాళ్ళ విధులు నిర్వహించాలని, లేక పోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మీర్జాఖలీల్, బేగ్ నోమిద్దీన్, పురుషోత్తం, షమీముల్లా, నాగరాజు, జిహెచ్ఎంసి సూపర్ వైజర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కార్పొరేటర్ రోజాదేవి పాదయాత్ర..

**వివేకానంద నగర్ కాలనీ, మే 6, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్లోని కమలప్రసన్న నగర్ కాలనీలో జీహెచ్ఎంసి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులతో కలిసి ప్రజా సమస్యలపై మంగళవారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చే ప్రతీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేదుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమల ప్రసన్న నగర్ రోడ్ నెంబర్ 12, 13లలో సీవరేజ్ లైన్లు చిన్నవిగా ఉండడం తరుచుగా వారానికి ఒకసారి మురుగునీరు రోడ్లపైకి రావడం మున్సిపల్టీ క్లీన్ చేయడం జరుగుతుందనడంతో కొత్తగా వన్ ఫీట్ లైన్ వేయవలసి ఉన్నదని, వీటి కొరకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే సిమెంట్ రోడ్డు మంజూరు చేయడం జరిగిందని కాంట్రాక్టర్తో మాట్లాడి వీలైనంత తొందరగా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా రోడ్డు పనులు చేపట్టాలని జీహెచ్ఎంసి అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్బి మేనేజర్ ప్రియాంక, జీహెచ్ఎంసి నిఖిల్, కాలనీ అధ్యక్షులు శేఖర్, రాఘవులు, ఆంజనేయులు, రాజు, శ్రీశైలం గౌడ్, రామ, తిరుపతి, బండప్ప తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును కలిసిన బిసి ఉద్యోగుల సంఘం


సిఎస్‌ను సన్మానిస్తున్న చంద్రశేఖర్‌గౌడ్, రమా, శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన రామకృష్ణారావును తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం .చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. సెక్రటేరియట్ లో సిఎంకార్యాలయం లో రామకృష్ణారావును కలిసి శాలువా బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సమస్యలను వివరించారు. మరి ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన నగదు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. మెడికల్ రియంబర్స్ మెంట్ ను పెంచాలని చిన్న జీతాలు పొందుతున్న ఉద్యోగులకు అండగా వుండాలని కోరినట్లు చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రమా, సలహాదారులు సుంకరి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ రామ రాఘవర్మ, శ్రీనివాస్ , కార్యదర్శి మహేంద్ర సాగర్ జగన్ పాల్గొన్నారు.

## బాలచిత్రకారుడు నవీకాంత్‌కు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంస


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి పోర్ట్రయిట్ చిత్రాన్ని బహుకరిస్తున్న బాల చిత్రకారుడు నవీకాంత్

**శేరిలింగంపల్లి, మే 6 ప్రభాతవార్త:** బాలచిత్రకారుడు నవీకాంత్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. బెల్ టౌన్‌షిప్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నవీకాంత్ బిహెచ్ఈఎల్‌కు వచ్చిన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి పెన్సిల్ స్కెచ్‌తో వేసిన పోర్ట్రెయిట్‌ను బహుకరించారు. ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ 2025 (డ్రాయింగ్ కేటగిరీ)లో రాష్ట్ర టాపర్‌గా నిలిచిన నవీకాంత్ చిన్ననాటి నుంచి పోర్ట్రెయిట్‌లను గీయటంలో మంచి పరిణతి సాధించాడు. ఇటీవలే ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ (డ్రాయింగ్ పోటీ)లో తెలంగాణ రాష్ట్రం నుంచి విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలున్ని స్థానిక ఎమ్మెల్సీ ఎస్.అంజిరెడ్డి సహాయంతో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిశారు. పెన్సిల్‌స్కెచ్‌తో వేసిన గడ్కరీ చిత్రపటాన్ని బహుమతిగా అవ్వడంతో నితిన్ గడ్కరీ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నవీకాంత్ ప్రతిభను కేంద్రమంత్రి ప్రశంసించారు. కేంద్రమంత్రిని కలిసే అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డికి నవీకాంత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో నిత్య అఖండ హరినామ సంకీర్తన జరగాలి

-అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీవిజయ శంకరస్వామి


హైందవ భక్తి కళ సమ్మేళనంలో పాల్గొన్న అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకరస్వామి

**ధర్నాచౌక్, మే 6, ప్రభాతవార్త:** యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కూడా తిరుపతి తరహాలో నిత్య అఖండ హరినామ సంకీర్తన జరగాలని అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీ విజయ శంకర స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో సంకీర్తన సంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరి అంటూ హైందవ భక్తి కళా సమ్మేళనం అన్నమయ్య కళాక్షేత్రం మరియు హిందూస్ ఫర్ పూరాలిటీ అండ్ జస్టిస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమ్మేళనంకు ముఖ్య అతిథిగా హాజరైన విజయశంకరస్వామి మాట్లాడుతూ యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో హరినామ సంకీర్తనల నిర్వహణకు ప్రభుత్వం వెంటనే భజన బృందాలకు అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో హిందూ ధర్మాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలనే కోసం దేవాలయాల్లో భక్తి భావంతో కళారూపాల ప్రదర్శన ద్వారా ఆధ్యాత్మిక భావజాలాన్ని స్వామివారి భక్తుల దగ్గరికి తీసుకెళ్లటం కోసం హరినామ సంకీర్తనలు నిరంతరాయంగా నిర్వహించాలని సూచించారు. సాంప్రదాయ శాస్త్రీయ కళారీతులు, జానపద కళారీతులకు పుట్టినిల్లు అయిన తెలంగాణలో గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వివిధ కళారూపాల ప్రదర్శనలు ఇవ్వటానికి వేలాది బృందాలు, వేల మంది కళాకారులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వెంటనే దేవాదాయ శాఖ స్పందించి, నిత్య అఖండ హరినామ సంకీర్తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఖడీజాన్ తెలుగు యోధ విజయవిహారం రమణ మూర్తి, బిర్లా మందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు, భక్త రామదాసు వారసులు కంచర్ల శ్రీనివాస్, అన్నమయ్య కళాక్షేత్రం యాదగిరిగుట్ట కన్వీనర్ శిక గణేష్, మౌన స్వామి ఆశ్రమం శివస్వామి, గురుమాత దేరంగుల నారాయణమ్మ, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులు, ఆధ్యాత్మిక ప్రవచనవేత్త దరూరి నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# 12 నుంచి చిక్కడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వస్వామి అలయ ముఖద్వారము

**చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త:** తిరుమల తిరు క్షేత్రానికి సాక్షాత్తు ప్రతిబింభంలా నిలిచిన శ్రీ శ్రీనివాసుని కోవెల చిక్కడపల్లి ప్రాంత ప్రజలతో పాటు భాగ్యనగారినిక కొంగుబంగారమై కొలువుదీరింది. మే 12వతేదీ నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని అలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్ గౌడ్, కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ వివరించారు. ఆలయంలో 12న సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, రాత్రి 8 గంటలకు మహానివేదన, మంత్రపుష్పం, 13న ఉదయం పతాధివాసము, హవనము, బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణము ఉంటుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము, రాత్రి శేషవాహనసేవ ఉంటుంది. 14న పల్లకీసేవ, రాత్రి హంసవాహనసేవ, 15న ఉదయం పదిన్నరకు పల్లకీసేవ, రాత్రి గజవాహనసేవ,16న పల్లకీసేవ అనంతరం స్వామివారికి ఎదురుకోళ్లు అనంతరం కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 17న పల్లకీసేవ, గరుఢవాహన వాహన సేవ, 18న రథప్రతిష్ట, స్వామివారి శృంగార రథోత్సవం, 19న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. 20న ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామి వారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం అరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

# మణికొండలో చెట్టు చుట్టూ ఫెన్సింగ్

("వార్త ప్రభావం")

- హర్షం వ్యక్తం చేస్తున్న తిరుమలహిల్స్ ప్రజలు


మణికొండ తిరుమలహిల్స్‌లో చెట్టు చుట్టూ ఫెన్షింగ్ వేయించిన దృశ్యం

**నార్సింగి, మే 6 ప్రభాతవార్త :** ఏప్రిల్ 28.వ,తేదీన వార్త పత్రికలో "చెట్టును నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి" అన్న శీర్షికపై ప్రచురితమైన వార్తకు మణికొండ మున్సిపల్ అధికారులు, ఎన్విరాన్‌మెంట్ అధికారులు స్పందించారు. కొమ్మలు నరికి వేసిన చెట్టు చుట్టూ ఇనుప చువ్వలతో కంచెను వేసి, ఈ చెట్టును మరోమారు నరికితే వాల్టా చట్టం ప్రకారం... కఠినమైన చర్యలుతీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్, ఎన్వీరాన్‌మెంటల్ అధికారి సంపత్‌లు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పచ్చటి చెట్లు పెంచాలని ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవంను నిర్వహిస్తుంటే మణికొండ తిరుమల హిల్స్ కాలనీలో ఏపుగా పెరిగిన చెట్టును నరికివేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికే ఈ చెట్టును ఒకేవ్యక్తి రెండు మార్లు నరికినట్లు స్థానికులు తమకు ఫిర్యాదు చేశారని, ఇప్పుడు మేము చెట్టు చుట్టూ ఫెన్షింగ్ చేశామని, ఈ సారి చెట్టును నరికితే తగిన శిక్షను అనుభవించేందుకు సిద్దంగా ఉండాలని స్పష్టం చేశారు. చెట్టు వాతావరణంలోని చెడు వాయువులను తీసుకొని, ప్రాణవాయువు(ఆక్షీజన్)ను విడుదల చేస్తాయని, వాతావరణంను చల్లగా ఉంచుతాయని, భూగర్భ నీటి మట్టం పడిపోకుండా కాపాడుతాయని వివరించారు. ప్రజలందరూ చెట్టను పెంచాలని, తుంచకూడదని మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్ సూచించారు. మున్సిపల్ కమీషనర్, ఎన్విరాన్‌మెంట్ అధికారులు స్పందించి చెట్టు చుట్టూ ఫెన్షింగ్ వేయించడం పట్ల తిరుమలహిల్స్ కాలనీ అధ్యక్షులు అవినాశ్, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రేమ పేరుతో యువకుడి వేధింపులు... బాలిక ఆత్మహత్య

**హయత్ నగర్, మే 5 ప్రభాతవార్త :** ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయడంతో మనస్థాపంతో యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... హయత్ నగర్ డివిజన్ రంగనాయకుల గుట్ట కాలానీలో నివాసముండే కనిగిరి విజయ్ మరియు తిరుపతమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్ళు, ఒక కుమారుడు ఉన్నారు. రెండవ కూతురు (14) హయత్ నగర్ లోని గవర్నమెంట్ హైస్కూల్లో 9వ తరగతి పూర్తి చేసింది. ఆరు నెలలుగా అమెను అదే కాలనీకి చెందిన పాను బోతు రోహిత్ ప్రేమ పేరుతో వేధించ సాగాడు. విషయాన్ని బాలిక తన తండ్రికి చెప్పగా ఆయన రోహిత్ తండ్రి స్వామితో మాట్లాడి కుమారుడుని మందలించాలని సూచించాడు. అయినప్పటికీ కొద్ది రోజులుగా రోహిత్ తన తమ్ముడు నూతన్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా మీనాక్షి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ కి తరచుగా వీడియో కాల్స్, ఎస్ఎంఎస్ చేస్తున్నాడు. కూతురు ద్వారా విషయం తెలుసుకున్న విజయ్ మరోసారి రోహిత్ తండ్రిని హెచ్చరించాడు. ఈనెల 4న మధ్యాహ్నం రోహిత్ తన తమ్ముడు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా మీనాక్షికి ఎస్ఎంఎస్ చేయగా అదే రోజు సాయంత్రం విజయ్ హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 5న దగ్గరి బంధువు చనిపోవడంతో విజయ్ భార్యతో కలిసి మహబూబ్ నగర్ జిల్లా మానజీపేట కి వెళ్ళి రాత్రికి తిరిగి వచ్చారు. ఆ సమయంలో రోహిత్ ఇంటికి వచ్చాడాని... తనని ప్రేమించాలని లేకపోతే సంగతి చూస్తానని బెదిరించినట్లు తండ్రికి చెప్పి ఏడ్చింది. అనంతరం అందరు నిద్రపోయారు. తెల్లవారుజామున 4.30 గంటలకు తిరుపతమ్మ వాటర్ వస్తున్నాయని లేచి చూడగా తన కూతురు ఇంట్లో గల కిరాణం షాపులో రేకుల కింద ఐరన్ పైపుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మరణానికి కారణమైన రోహిత్, అతని తండ్రి స్వామి, సోదరుడు నూతన్ పై చర్య తీసుకోవాలని విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.... పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కె.వి.రమణాచారిని పరామర్శించిన హరీష్‌రావు, దేశపతి శ్రీనివాస్


డా. కె.వి.రమణాచారిని పరామర్శిస్తున్న హరీష్‌రాబు, దేశపతి శ్రీనివాస్‌లు

**నాంపల్లి, మే 6 ప్రభాతవార్త :** మోకాలి శస్త్రచికిత్స అనంతరం పూర్తి విశ్రాంతితో కోలుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎస్ అధికారి డా. కె.వి.రమణాచారిని తెలంగాణ శాసనసభ్యుడు, మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, ప్రముఖ రచయిత, గాయకుడు దేశపతి శ్రీనివాస్ లు మంగళవారం ఉదయం ఆయన స్వగృహంలో పరామర్శిం చారు. హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణాచారి నివాసానికి వెళ్లిన హరీష్‌రావు, దేశపతి శ్రీనివాస్‌లు మోకాలి శస్త్రచికిత్స, అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కె.వి.రమణాచారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## సబితా ఇంద్రారెడ్డికి సిబిఐ కోర్టు క్లీన్ చీట్

-కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ హర్షం

**అత్తాపూర్ మే 6,ప్రభాతవార్త :** ఓబుళాపురం మైనింగ్ కేసులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి నాంపల్లిలోని సిబిఐ కోర్టు క్లీన్ చీట్ ఇవ్వడంపై రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పార్టీ హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తమ నాయకురాలను నిర్ధోషిగా కోర్టు తేల్చడంపై సంతోషం వ్యక్తం చేశారు. సబితాఇంద్రారెడ్డి పేద ప్రజల మనిషీ అన్ని అమె దేవుడి,ప్రజల అండ ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు.

# సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం : సిఐటియు


మున్సిపల్ అధికారి సక్కుబాయికి సమ్మె నోటీసు అందజస్తున్న చంద్రశేఖర్

**నిజాంపేట్, మే 6, ప్రభాతవార్త**

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామంటూ కార్మికులకు సిఐటియు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మే 20వ తేదీ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుప తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు ఉద్యోగులు పాల్గొంటారని మంగళవారం మున్సిపల్ అధికారి సక్కుబాయికి సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ల అమలును రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెబుతున్నప్పటికీ ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. పెండింగ్ వేతనాలు గురించి కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించిన సందర్భంగా మే రెండో తేదీ నాటికి రెండు మాసాల కార్మికుల వేతనాలు చెల్లిస్తామని కమిషనర్ హామీ మేరకు మేనేజర్ పవన్ కుమార్ యూనియన్ నాయకులకు, కార్మికులకు వెల్లడించడం జరిగింది. కానీ ఒక్క మాసం వేతనం మాత్రం చెల్లించి, రెండో నెల వేతనం చెల్లించకపోవడం కార్మికులను అవమానించి నిర్లక్ష్యం వహించినట్లుగా యూనియన్ భావిస్తుందన్నారు. వెంటనే రెండో నెల వేతనం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశు, చిన్న, నరసింహ, మన్యం గురవయ్య, యాదగిరి, ఈశ్వరయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు


సమ్మె నోటీసును నార్సింగి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌కు ఇస్తున్న ఆశా వర్కర్లు తదితరులు.

**నార్సింగి, మే 6 ప్రభాతవార్త :** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ప్రైవేటీకరణను ఆపాలని, ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26.వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నార్సింగి పిహెచ్‌సి మెడికల్ అధికారికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింని సిఐటియు మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆశా వర్కర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలని, గత రెండు దశాబ్దాల నుంచి పేదలకు ఆశా వర్కర్లు వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆశా వర్కర్లపై పనిభారం పెరిగిపోయిందని, నిత్యవసర ధరలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. 2013లో ఇండియన్ లేబర్స్ కాన్ఫరెన్స్ సమావేశం ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పిఎఫ్ ,ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఎన్‌ఎ ప్రైవేటీకరణ చేయకూడదని తీర్మాణం చేసిందన్నారు. ఈ నెల 20.వ,తేదీన సమ్మె చేయడం జరుగుతుందని నోటీసును మెడికల్ అధికారికి అందజేశామని ప్రవీణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే నార్సింగి మున్సిపల్ మేనేజర్ నాగేంద్రబాబుకు సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. కార్మికులు అనేక త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 29.కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకు రావడం అన్యాయమన్నారు. ఈ కోడ్స్ అమలైతే కార్మికుల ఉద్యోగ భద్రత, ఉపాధి కోల్పోతారన్నారు. కార్మిక శాఖ నిర్వీర్యం అవుతుందన్నారు. కార్మికుల కనీస వేతనం 26.వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించడం మంచి సంప్రదాయం


ఉత్తమ మాతృమూర్తులను సత్కరిస్తున్న భీమన్న సాహితినిధి అధినేత్రి, ప్రముఖ గాయనీ హైమావతి భీమన్న

**చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త:** వివిధ రంగాలకు చెందిన వారిని గుర్తించి సత్కరించడం మంచి సంప్రదాయమని భీమన్న సాహితినిధి అధినేత్రి, ప్రముఖ గాయనీ హైమావతి భీమన్న అన్నారు. మంగళవారం తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధినేత్రి డాక్టర్ గురజాడ శోభాపేరిందేవి నిర్వహణలో రానున్న మదర్–డే ని పురస్కరించుకుని విద్యానగర్ లోని ఆంధ్ర మహిళా సభ ఆధ్వర్యంలో ఉత్తమ మాతృమూర్తులు ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి, , ఆంధ్ర మహిళా సభ ఉపాధ్యక్షురాలు డా.లక్ష్మి సుందరి, ఉత్తమ గాయని శ్రీమతి రాజ్యలక్ష్మి ని సత్కరించే కార్యక్రమం జరిగింది. సేవా కార్యక్రమాల్లో భాగంగా లబ్దిదారులకు వీల్‌ఛైర్, సైకిల్, చేతికర్రలను, కొంతమందికి ఆర్థిక సహాయ కార్యక్రమాలను నిర్వహించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఇదే కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. హైమావతి బీమన్న మాట్లాడుతూ సంస్థ ప్రారంభమైన ఏడాదిలోపే సేవా సహకార కార్యక్రమాలు విపరీతమైన వేగంతో చేస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డి.హేమలత, సంధ్య, డీ శైలజ ,అరుణ పాల్గొన్నారు

## మాక్ డ్రిల్లులో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొనాలి

**చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త:** కేంద్ర హోంమంత్రిత్వశాఖ బుధవారం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పౌర రక్షణకు సంబంధించిన మాక్ డ్రిల్లులు నిర్వహించాలని ఆదేశించిందని, ఇందులో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గానుగపాటి సూర్యనారాయణ శర్మ విజ్ఞప్తి చేశారు. . ఈ డ్రిల్లుల ప్రధాన ఉద్దేశం – అత్యవసర పరిస్థితుల్లో ప్రజల రక్షణకు సంబంధించిన యంత్రాంగాన్ని సమర్థంగా పనిచేయగలగేలా తయారు చేయడం అని అన్నారు. వైమానిక దాడుల హెచ్చరికల కోసం సైరన్లను క్రియాశీలం చేయడం, శత్రుదాడుల సమయంలో పౌరులు, విద్యార్థులు తమను తాము ఎలా రక్షించుకోవాలో శిక్షణ ఇవ్వడం, బ్లాక్‌అవుట్ చర్యలు (విద్యుత్ నిలిపివేత) అమలు చేయడం, ముఖ్యమైన మౌళిక సదుపాయాలపై ముందుగానే కప్పివేయు చర్యలు (క్యామఫ్లాజ్) చేపట్టడం, తరలింపు ప్రణాళికలను పునఃసమీక్షించి, సాధన చేయడం, ఇటువంటి అంశాలలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో విలువైనదిగా మారుతుందన్నారు. ఈ డ్రిల్లుల్లో చురుకుగా పాల్గొని దేశ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు.

## కారు ఢీ కొని మూడేళ్ల బాలుడు మృతి..

**కొంపల్లి, మే 6, ప్రభాతవార్త**

రోడ్డుపై వెళ్తుండగా ఓ కారు ఢీ కొని మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, రాజుగోపాలం గ్రామానికి చెందిన సూరి బాబు దంపతులు ప్రశాంతి హిల్స్ రోడ్ నెంబర్1, మధురా నగర్‌లోని వెంకట సాయి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సూరిబాబు కుమారుడు అనిల్ కుమార్ (3)ను మంగళవారం సాయంత్రం 4:40 గంటల సమయంలో మధురానగర్ ఎక్స్ రోడ్డు వద్ద ఓ కారు (టీఎస్ 08 జెఎస్ 0805) ఢీ కొట్టింది. వెంటనే డ్రైవర్ అతన్ని ప్రసాద్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డ్రైనేజ్, మంచినీటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తాం

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్


అడిక్‌మెట్‌లో పర్యటించిన అనంతరం బస్తీవాసులు ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహాలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గంలో మంచినీరు, డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అడిక్మెట్ డివిజన్ నేషనల్ గల్లి, వడ్డెర బస్తీ, పోచమ్మ బస్తి లలో ఎమ్మెల్యే పర్యటించి బస్తివాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజ్, కలుషిత మంచి నీరు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాత డ్రైనేజ్ , మంచినీటి పైపు లైన్లను మార్చి కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా, స్థానిక బిఆర్ఎస్ నేతలు శ్యాంసుందర్ చిట్టి, అస్లాం, నేత శీను, శ్రీనివాస్‌రెడ్డి, మాధవ్, అబ్బు బాయ్, కిషోర్, ఖలీల్, యూనిస్, రాజు, శీను, వెంకటేష్, చాంద్ భాయ్, ఆబేద్, ముక్రం, శేషు, సాయి గోవర్ధన్ పాల్గొన్నారు

## శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్


జోనల్ కమిషనర్ హేమంత్‌ను సత్కరించిన రాగం నాగేందర్‌యాదవ్

**శేరిలింగంపల్లి, మే 6 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన హేమంత్ బోర్ఖడ్,డిప్యూటి కమిషనర్ వి.ప్రశాంతిలను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌ను, డిప్యూటి కమిషనర్‌లను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్‌లో నెలకున్న పలు సమస్యలను, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జోనకల్ కమిషనర్‌తో చర్చించారు. అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు.

## 'అన్నమాచార్య సంకీర్తన మహాయజ్ఞం'


గానం చేస్తున్న గురు వెంకటేశ్వర్లు కోటపాటి గోవిందదాసు

**చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త:** ఎస్ఎస్ఎస్వి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు వెంకటేశ్వర్లు కోటపాటి గోవిందదాసు స్వరపరచి గానం చేస్తున్న 108 సంకీర్తనలతో 'అన్నమాచార్య సంకీర్తన మహాయజ్ఞం' చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని మారుతి కళావేదికలో ఆధ్యాత్మికవాతావరణంలో ప్రారంభమైంది. ఈ నెల 11వరకు ఈ సప్తాహం కొనసాగనుంది. దక్షిణ భారత తొలి వాగ్గేయకారులు అన్నమాచార్యులవారి 617 జయంతిని పురస్కరించుకొని 108 సంకీర్తనలు ఆలపించనున్నారు. గురు వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాస స్వర రచనతో శ్రీత్యాగరాయ గానసభలోని మారుతి కళావేదికపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంకీర్తన కార్యక్ర మంలో గాయనీ అనురాధ కోటపాటితో కలిసి గోష్ఠి గానం చేశారు.

# మండుటెండలో మంటలు

-అగ్నికి ఆహుతైన 30 గుడిసెలు

-షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు ...పేలిన సిలిండర్

**ఎల్‌బినగర్, మే 6 ప్రభాతవార్త:** మండుటెండలో అగ్ని మంటలు చెలిరయిగాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మొదలైన ప్రమాదం గ్యాస్ సిలిండర్ పేరడంతో గుడిసెలు దగ్ధమయ్యాయి. వేసవి మండుటెండలో గుడిసెలు ఖాళీ పెద్దఎత్తున పొగమంటలు చెలరేగాయి. మంటలు చిల్లరేగడంతో గుడిసేవాసులు అరుపులు కేకలు పెడుతూ పరుగులు పెట్టారు. ఈ అగ్ని ప్రమాదంలో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది. గుడిసెలోని టీవీలు, ఫ్రిజ్జులు, బట్టలు, సర్టిఫికెట్లు, బంగారం, వెండి ఇతర వస్తువులు కాలిపోయినట్లు బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటన ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగోల్ డివిజన్ సాయినగర్‌కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది.స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాయినగర్ గుడిసెల కాలనీలో మజీద్ సమీపంలో ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ఒక గుడిసెపై విద్యుత్ వైర్ మండుతూ ఉందని అది చూస్తుండగానే నిప్పు అంటుకొని మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. ఉవ్వెత్తున మంటలు చెలరేగడం పొగ వస్తుండడంతో గుడిసెలో నివాసం ఉంటున్న వారితో పాటు పరిసర ప్రాంతాల వారు కేకలు వేశారు. మంటలు చెలరేవుతుండడంతో గుడిసెలోని వారు బయటకు పరుగులు పెట్టారు. క్షణక్షణానికి మంటలు పెరిగిపోతుండడంతో గుడిసెలలోని వంటగ్యాస్ సిలిండర్లు పేలిపోయి అగ్ని ప్రమాదం మరింత ఉధృత స్థాయికి చేరింది. స్థానికులతో పాటు గుడిసె వాసులు అగ్నిప్రమాదం విషయాన్ని స్థానిక పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఒకవైపు నాగోల్ పోలీస్ స్టేషన్ సిఐ ఏ.సూర్య నాయక్ తన సిబ్బందితో మరోవైపు అగ్నిమాపక అధికారులు ఫైర్ ఇంజన్లతో సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి పెరిగిపోతున్న మంటలను ఆర్పి వేశారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, జిహెచ్ఎంసి సిబ్బంది, డిజాస్ట ర్ మేనేజ్మెంట్ సిబ్బంది, పెరిగిపోతున్న మంటలను అదుపు లోకి తేవడానికి సమన్వయంతో పనిచేశారు. సకాలంలో అధికారులు స్పం దించి ప్రమాదాన్ని అరికట్టారు. దీంతో అధికారులతో పాటు బాధిత గుడిశవాసులు పరిసర ప్రాంతాల కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.


## కలలను ప్రోత్సహించడం అభినందనీయం : అంజని కుమారి



అంజని కుమారిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

**మలక్ పేట ,మే 6, ప్రభాతవార్త:** కలలను ప్రోత్సహించడం అభినందనీయమని సిఎస్సి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి అంజని కుమారి పేర్కొన్నారు. తెలంగాణ భాష సంస్కృతి శాఖ, తెలంగాణ జాగృతి సమితి సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ నృత్య ప్రదర్శన కార్యక్రమంలో అంజని కుమారికి కుమారికి కళా జాగృతి ధార్మిక సేవారత్న పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు కళల పట్ల ఆసక్తి ని పెంపొందిస్తూ కళలను ప్రోత్సహిస్తూ పిల్లల భవిష్యత్తుకు ఉన్నతమైన మార్గాన్ని వేస్తున్న గురువుల పాత్ర తినలేదని ఎనలేనిదని కొనియాడారు. మన దేశంలో ఇటువంటి కార్యక్రమాలను పండుగలగా చేసుకుంటూ ఇతర దేశాలకు ఆదర్శంగా నిందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత సమాజానికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు చాలా అవసరమని పేర్కొన్నారు. పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాల ద్వారానే సాధ్యమన్నారు. తెలంగాణ జాగృతి సమితి ఫౌండర్ పద్మ వెంకటేష్, రత్నాకర్ శర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేష్, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమావేశం



**మల్కాజిగిరి మే6,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమీషనర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మల్కాజ్గిరి అభివృద్ధి పనులపై మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ పలు అభివృద్ధి పనుల పై ప్రత్యేక సమీక్షించారు.ఈ సందర్భంగా సఫిలగూడ చెరువులో గుర్రపు డెక్క, ఓపెన్ జిమ్ పరికరాలు, ఎంట్రన్స్ ఆర్చి, చుట్టూ బండ్, విమలదేవి నగర్ లో బాక్స్ డ్రైన్, బాల సరస్వతి నగర్ లో, సర్దార్ పటేల్ నగర్ లో నాలా పనులు, పలు సీసీ రోడ్ల పురోగతి పైన చర్చించారు.తదుపరి అభివృధి పనుల పురోగతి పైన సుధీర్ఘ చర్చ చేసి ప్రతిపాధనలను కమీషనర్ గారికి పంపడం జరిగింది.అదే విధంగా భ్రమరాంబికా నగర్ లోని నాలా పనులను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమం లో డి.ఈ మహేష్, ఏ.ఈ నవీన్, రమేష్ పాల్గొన్నారు.

## ముంపు సమస్యకు పరిష్కారం



**మల్కాజిగిరి మే6,ప్రభాతవార్త :** మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ సత్తి రెడ్డి నగర్ నుండి లాలాపేట డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ వాసుల ముంపు సమస్య శాశ్వత పరిష్కారం జరుగుతుందని కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ తెలిపారు. కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రాంతంలో తీవ్ర సమస్యగా గతంలో ఉండేదన్నారు. లాలాపేట కార్పొరేటర్ మరియు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి ఆరు నెలల క్రితం సంయుక్తంగా కాలనీలో పర్యటించే సమస్య పరిష్కారం కు సిద్ధం చేశామన్నారు. సుమారు 65 లక్షలు బాక్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారన్నారు పనులు చురుగ్గా జరుగుతున్నాయని వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు పూర్తి చేస్తామన్నారు. నిధులు మంజూరు చేసినటువంటి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి గారికి కి డివిజన్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను ఈ రోజు అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఈ ఈ లక్ష్మణ్, డీ ఈ లు లౌక్య,సువర్ణ, ఏ ఈ శ్రీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు,ఉదయ్ కుమార్ తదితరులు ఉన్నారు

## మహా ధర్నాను జయప్రదం చేయండి : నర్సిం హ



పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు.

**అబ్దుల్లాపూర్ మెట్, మే 6 ప్రభాతవార్త :** మాత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఈ నెల 15న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాలో మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో మంగళవారం నాయకులు మహా ధర్నా ఫోస్టర్ ను ఆవిష్కరించారు. ఏ సందర్భంగా గోరెంకల నర్సింహ్మ మాట్లాడుతూ జిల్లాలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని అన్యాయంగా కుల్చివేసారని దానిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులుగా బదులుగా మత్స్య సొసైటిల అకౌంట్లలో నగదు జమ చేయాలన్నారు. 50 ఎడ్లు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛను ఇవ్వాలని, కబ్జాలకు గురైన చెరువులు, కుంటలు, కాల్వలను శాటిలైట్ ద్వారా సర్వే చేసి ఎఫ్ టి ఎల్ హద్దురాళ్ల ఎర్పాటు చేయాలన్నారు.ఇబ్రహీంపట్నం చిన్న చెరువు ప్రక్కన ఎకర స్థలం కేటాయించి చేపల మార్కెట్ నిర్మించాలి. ఈ మేరకు ఇంద్రపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో మత్స్య కారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కావాలి రాములు, నాయకులు మాచగోని రమేష్, కామటి ప్రభాకర్, పురం రమేష్, కావాలి జంగయ్య, రవీందర్, సాదు అంజనేయులు పాల్గొన్నారు.



సైదాబాద్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రమోహన్‌ను స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రవీందర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ( ప్రభాతవార్త, సైదాబాద్)

## మల్కాజ్గిరి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి



**నేరెడ్ మెట్, మే6,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వినాయక డివిజన్ పరిధిలోని పలు కాలనీ ల వాసులు క్యాంపు కార్యాలయం కు వచ్చి తాము ఎదుర్కొంటున్న మోలిక సదుపాయాల సమస్యలను తమకు ఏకరువు పెట్టారని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రదానంగా వినాయక్ నగర్ డివిజన్లోని పలు కాలనీల ప్రజా సమస్యలను కాలనీల అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం కృషి చేస్తానని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వారికి తెలిపారు.అదేవిదంగా 137 వినాయక్ నగర్ డివిజన్ లోని ఈస్ట్ చంద్రగిరి కాలనీ లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను ఆధునికరించాలని వీధి దీపాలు వేయించాలని, స్పీడ్ బ్రేకర్లు వేయించాలని సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, లక్ష్మీ నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ను అభివృద్ధి చేయాలని స్పీడ్ బ్రేకర్లు వేయించాలని కోరారు... ఆకుల నారాయణ కాలనీలో పారిశుద్ధ నిర్వహణ, సీసీ రోడ్లు వేయించాలని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు.సిద్ధి వినాయక నగర్ లో వీధి నెంబర్ 26, 28 లో ఇండ్లపై వెళ్తున్న 11 కె.వి లైన్లను మార్చాలని, త్రాగునీరు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎన్.బి.హెచ్ కాలనీలో ట్రంకు పైపులైన్ 100 మీటర్లు వరకు పొడిగించాలని,బండ చెరువు సమీపంలో గల లాల్ వాణి నగర్ లో చెరువుకు సంబంధించిన వ్యర్థాలను తొలగించాలని కోరారు.సిసి రోడ్లు వేయించాలని స్పీడ్ బ్రేకర్లు వేయించాలని నీటి సమస్య పరిష్కరించాలని,శివనగర్ కాలనీలో త్రాగు నీరులో ప్రెజర్ సమస్య పరిష్కరించాలని సీసీ రోడ్లు వేయించాలని,పలు సమస్యలు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, హేమంత్ రెడ్డి, తులసి సురేష్ , బాలకృష్ణ , ఫరీద్, పలు కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలను వాడవద్దు : ఎస్ జి ఎస్ దామోదర్



మామిడి పండ్ల వ్యాపారస్తులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎస్ జి ఎస్ దామోదర్, గ్రేడ్ వన్ కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి తదితరులు

**మలక్ పేట, మే 6, ప్రభాతవార్త:** మామిడికాయలను ఆరోగ్యానికి హాని కలిగించే కార్బైడ్ వంటి రసాయనలతో కాకుండా మార్కెట్ అధికారులు సూచించే పద్ధతులు ద్వారా ఇథోఫాన్ (ఇథలిన్ గ్యాస్)తో మక్క పెట్టుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఉపసంచాలకులు, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం.దామోదర్, గ్రేడ్ వన్ కార్యదర్శి చిలుక నరసింహారెడ్డిలు మామిడి వ్యాపారులకు సూచించారు. మలక్ పేటలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మంగళవారం జాంబాగ్ కు చెందిన మామిడి వ్యాపారులతో సమావేశమైన వారు, మామిడి కాయలను మక్కబెట్టే విధానం పై వ్యాపారులకు అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడికాయలను కార్బైడ్ తో కాకుండా ఇథలిన్ గ్యాస్ తో మక్క పెట్టాలని సూచించారు. ఇథోఫాన్ (ఇథలిన్) శాసెట్లను (ప్యాకెట్లను) నీటిలో ముంచి బాక్సుల్లో మామిడికాయలకు తగలకుండా వరిగడ్డి, పేపర్ల మధ్యన పెట్టి చిన్న హోల్ చేసి వాటిపై మామిడి కాయలను పోయాలని సూచించారు. పేపర్ కి చిన్న హోల్ చేయటం ద్వారా ఇథలిన్ గ్యాస్ మామిడికాయలకు చేరుతుందని ఈ విధంగా మక్క పెట్టడం ద్వారా ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగదని వారు సూచించారు. మార్కెటింగ్ శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచనల ప్రకారం ఇథలిన్ గ్యాస్ తో వారు సూచించిన విధంగా మామిడి కాయలను మక్కబెట్టాలని అన్నారు. అధికారుల సూచనలను ఉల్లంఘించి ఇష్టా రీతిన మక్క పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. మామిడి పళ్ళు ఆరోగ్యానికి సంబంధించినవి అయినందునా, ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలను వాడవద్దని, ఆరోగ్య నిబంధనలను, సూచనలను తప్పక పాటించాలని వారు సూచించారు. సోమవారం జాంబాగ్ లో స్వాధీనం చేసుకున్న మామిడికాయలను ల్యాబ్ టెస్ట్ కోసం పంపించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధికారులు పుష్ప, పవన్, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పై దాడికి పాల్పడిన నలుగురు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

**మలక్ పేట, మే 6, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 2019నుండి హైదరాబాద్ నగర పోలీస్ స్పెషల్ బ్రాంచ్, సౌత్ ఈస్ట్ జోన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న టీ. సర్వేశం సోమవారం సాయంత్రం సుమారు 17.30 గంటల సమయంలో తన పాస్‌పోర్ట్ విచారణ కోసం గోగు అర్షితాకు ఫోన్ చేయగా అతని కాల్‌కి అర్షిత తల్లి జి.సునిత ఫోన్ తీసుకొని, వారి చిరునామా తెలియజేశారు. సుమారు 18.00 గంటల సమయంలో అతను ముసారంబాగ్ లోని గీత్నాజలి అడ్మైర్ అపార్ట్‌మెంట్ బి1కు వెళ్లాడు. అప్పటి వరకు అర్షిత ఇంట్లో లేరు. ఆమె తల్లి, సోదరుడు ఇంట్లో ఉన్నారు. పాస్‌పోర్ట్ విచారణలో భాగంగా వారి డాక్యుమెంట్లను పరిశీలించి, అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే వ్యక్తిని సాక్షిగా పిలవమని చెప్పారు. కొంతసేపటికి అనితా అనే మహిళ అక్కడకు వచ్చారు. ఆమెను అడిగినప్పుడు, ఆమె అభ్యంతరకరంగా ప్రవర్తించి గొడవకు దిగారు. ఆమె తన భర్త శ్రవణ్ కుమార్, తమ్ముళ్ళు నరేష్, శివ మరియు శేఖర్‌లను పిలిపించారు. వెంటనే పై వ్యక్తులు అక్కడకు వచ్చి కానిస్టేబుల్ సర్వేశం ను అకారణంగా విషయం తెలుసుకోకుండా దూషించి కొట్టారు. అతని దుస్తులు చించేశారు. వెంటనే అతను తాను పోలీస్ కానిస్టేబుల్ అని చెప్పినప్పటికీ, వారు దూషించారు. తనపై దాడి చేసినవారిపై తగిన చర్యలు తీసుకోవాలని మలక్ పేట పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ సర్వేశం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వెంటనే మలక్ పేట పోలీసులు కానిస్టేబుల్ సర్వేశం పై దాడికి పాల్పడిన అనిత, శ్రవణ్ కుమార్, అగనూరి నరేష్, శివాలను అదుపులోకి అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోహింగ్యాలను వారి దేశానికి తిప్పి పంపాలి : అందె శ్రీరాములు యాదవ్



రోహింగ్యాల శిబిరాలను పరిశీలించి ఆరా తీస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి ఆనుకొని ఉన్న మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బాలాపూర్ గ్రామ సమీపంలో శరణార్థుల పేరిట ఉన్న రోహింగ్యాలనును తక్షణమే వారి దేశానికి తిప్పి పంపాలని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలువురు పార్టీ నాయకులతో కలిసి రోహింగ్యాలు నివాసం ఉంటున్న ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వారి శిబిరాల్లో కలయ తిరిగి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోహింగ్యాలకు సంబంధించిన శరణార్థి గుర్తింపు కార్డులను పరిశీలించే క్రమంలో వారి వద్ద ప్రభుత్వం మన దేశ పౌరులకు జారీ చేసే ఆధార కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు, ఆహార భద్రత కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, మొబైల్ ఫోన్ల సిమ్ కార్డులు, వాహనాలు బయట పడ్డాయని తెలిపారు.దాదాపు 20 వేల మంది వరకు రోహింగ్యాలు ఉన్నట్లు తెలుస్తోందనీ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రోహింగ్యాలతో పాటు బంగ్లాదేశీయులను సైతం ఇక్కడి నుండి వారి స్వదేశాలకు ప ంపించే ఏర్పాట్లు చేయాలని అందెల డిమాండ్ చేశారు. అంతకు ముందు శ్రీరాములు యాదవ్ స్థానిక బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి రోహింగ్యాల వ్యవహారం విషయమై ఆందోళన వ్యక్తం చేసి అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



సబితా ఇంద్రారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అర్కల కామేష్‌రెడ్డి, సిద్దాల బీరప్ప

**సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త:** ఓబుళాపురం మైనింగ్ కేసులో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా పని చేసిన ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డిని సిబిఐ కోర్టు నిర్దోషిగా తేలుస్తూ మంగళవారం తీర్పునివ్వడంపై మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిఆర్ఎస్ పార్టీ సంబరాలు జరిపింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమె మ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సబితా ఇంద్రారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దీప్‌లాల్ చౌహాన్, సిద్దాల బీరప్ప, జె.శ్రీనివాస్‌నాయక్, జమల్‌పూర్ సునీత బాలరాజ్, పాలపర్తి విజయలక్ష్మి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాదరి రమేష్, సిల్వేరి సాంబశివ, సిద్దాల అంజయ్య, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అనుబంధ విభాగాల శ్రేణులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



**తుర్కయంజాల్ మే 6(ప్రభాతవార్త) :** అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈనెల 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను దేశమంతా వ్యతిరేకిస్తోందని, కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమని సీఐటీయూ నేతలు ఆక్షేపణ వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు 2025 మే 20న జరిగే సమ్మెలో పాల్గొనాలని తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని వివిధ కంపెనీల యజమానులకు సమ్మె నోటీసు ఇచ్చారు.ఈ సందర్భంగా సిపిఎం, సీఐటీయూ మున్సిపల్ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. సమ్మెలో వివిధ పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఇల్లూరు భాస్కర్, జె ఆశీర్వాదం, ఏ మాధవరెడ్డి, ఎన్ యాదగిరి పాల్గొన్నారు

## రక్తదానం మరొకరికి ప్రాణదానం:ఉప్పల



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్‌బీనగర్, మే 6 ప్రభాతవార్త:** రక్తదానం మరొకరికి ప్రాణదానం అని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నాగోల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలను కాపాడిన వాళ్ళం అవుతామని అన్నారు. ముఖ్యంగా తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించింది అన్నారు. శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాన్ని, అభినందన జ్ఞాపికలను ఉప్పల అందజేశారు. ఐవిఎఫ్ హైదరాబాద్, రంగారెడ్డి మేడ్చల్ జిల్లా కమిటీలు, యువజన విభాగం సభ్యులు పెద్ద ఎత్తున శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉప్పల శ్రీనివాస్‌గుప్తను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

### 11 నుంచి బంగారు గవ్వల రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు



జిన్నారం విట్టల్‌రెడ్డికి పత్రికను అందజేస్తున్న వెంకటేశం

**ఎల్‌బీనగర్, మే 6 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ వినాయకనగర్‌కాలనీలోని శ్రీబంగారు గవ్వల రేణుక ఎల్లమ్మ దేవాలయం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ కట్ట వెంకటేశంస్వామిముదిరాజ్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను మంగళవారం చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్‌రెడ్డికి వెంకటేశం అందజేసి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవతా పూజలు, హోమాలు, అభిషేకాలు, శ్రీరామసత్యనారాయణస్వామి వ్రతం, గంగాపూజ, 18 కళాశాలతో మహాకుంభాభిషేకం, 13వ తేదీన కళ్యాణ మహోత్సవం, 14వ తేదీన 1008 మంది భక్తులతో బోనాలు సమర్పించుట తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.


### జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌తో బేటి అయిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 6 ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వి కర్ణన్‌తో మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను ఆయనతో చర్చించినట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. ఉప్పల్ నియోజవర్గం అభివృద్ధికి గ్రేటర్ కమిషనర్ పూర్తి సహకారం అందిస్తామని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను ఆయనను వివరించినట్లు తెలిపారు. త్వరలోనే ఉప్పల్‌లో గ్రేటర్ కమిషనర్ పర్యటించి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

### పాకిస్థాన్ మద్దతుదారులను వెనక్కి పంపించాలి : బిజెపి



ఎమ్మార్వో జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ, జంగం శ్వేతలు

**సైదాబాద్, మే 6 ప్రభాతవార్త:** బిజెపి అధిష్టానం పిలుపు మేరకు మన రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్, పాకిస్థాన్ మద్దతు దారులు, రోహింగ్యాలను తక్షణమే గుర్తించి వారిని వెనక్కి పంపించాలని డిమాండ్ చేస్తూ భాగ్యనగర్ జిల్లా బిజెపి ఆధ్వర్యంలో సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హరిగౌడ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనాథ్, రేణుక, గిరిధర్‌రెడ్డి, ప్రశాంత్, బుస్సు శ్రీకాంత్‌రెడ్డి, సుష్మ, భీష్మా చారి పాల్గొన్నారు.

### గవర్నర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్,రాంప్రదీప్ బృందం



రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవుని కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్,రాంప్రదీప్ దృశ్యం...

**కుషాయిగూడ,మే 6, ప్రభాతవార్త :** రాష్ట్ర గోవర్నర్ జిష్ణు దేవ వర్మనుమాజీ మంత్రి విజయం రామ రావు, మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పూసల బ్రహ్మ చారితో కలిసి మీర్పేట్ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి మర్యాద పూర్వకంగా రాజభవన్ లో కలిశారు.

## రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణప్రసాద్‌కు డాక్టరేట్





అమెరికా మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వి.కృష్ణప్రసాద్ తదితరులు

**ఉప్పల్, మే 6 ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసిలో సుమారు 44 ఏళ్లపాటు సేవలు అందించి అసిస్టెంట్ కమిషనర్‌గా పదవీ విరమణ చేసిన లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్, చైర్మన్‌గా సేవలు అందిస్తున్న వి.కృష్ణప్రసాద్‌కు అమెరికా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించింది. ఈ మేరకు న్యూఢిల్లీ గుల్‌మోహార్ ఇండియా హాబిటేట్ సెంటర్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో యూనివర్సిటీ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఉప్పల్ కళ్యాణపురిలో నివాసం ఉంటున్న కృష్ణప్రసాద్ జిహెచ్‌ఎంసిలో పదవీ విరమణ చేసిన అనంతరం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ ద్వారా విస్తృతమైన సేవలు అందించారు. చిరు వ్యాపారులకు గొడుగులు, దివ్యాంగులకు వీల్ చైర్స్, మహిళలకు స్వయం సమృద్ధికి కుట్టు మిషన్లు, ఉచిత కంటి వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలను నిరంతరం చేస్తుండడంతో పాటు ప్రభుత్వ రంగంలో సుదీర్ఘ కాలం సేవలను గుర్తించి తనకు అవార్డు బహుకరించినట్లు కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ అవార్డు తన మీద మరింత భారం పెంచిందని, తాను ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు.

### ఉప్పల్ కారిడార్ సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి

**ఉప్పల్, మే 6 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ సమస్య పరిష్కరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించినట్లు మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.600 కోట్లు విడుదల చేసిందని, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యం జరుగుతున్నాయన్నారు. కేంద్ర మంత్రి శంకుస్థాపన చేసిన తర్వాత పైప్‌లైన్లు, విద్యుత్ స్థంభాలు, భూసేకరణ కోసం ఆరు సంవత్సరాలు పట్టిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కారిడార్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దీనిపై కేంద్ర మంత్రిని కలిసి విన్నవించామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

### సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ వినతి






కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

**ఎల్‌బీనగర్, మే 6 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్నన్‌కు కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండటంతో పెండింగ్‌లో ఉన్న బాక్స్‌డ్రైనేజ్ పనులు పూర్తి చేయాలని కోరారు. సత్యనగర్, మోహన్‌నగర్, కొత్తపేట శ్మశాన వాటికలో త్రాగునీరు, మరుగుదిడ్లు, వీధిదీపాలు, ప్రహారీగోడలు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. శ్మశానవాటికల అభివృద్ధి, నూతన సీసీ, బిటి రోడ్లకి నిధులు మంజూరు చేయాలని, శానిటైజేషన్, వీధిదీపాలు, దోమల సమస్యలు ఉన్నాయన్నారు. అందుకు స్పందించిన కమిషనర్ త్వరలో ఆయా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

### ముగిసిన అష్టలక్ష్మి దేవాలయం బ్రహ్మోత్సవాలు

**ఎల్‌బీనగర్, మే 6 ప్రభాతవార్త:** గత వారం రోజులుగా జరుగుతున్న అష్టలక్ష్మి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆర్.కె.పురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టిసహిత బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు అభిషేకాలు, హోమాలు, స్వామివార్ల వాహన సేవలు, రథోత్సవం, స్వామివారి కళ్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలను వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగిందని ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమ సురేష్ కుమార్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు మంచినీరు, మజ్జిగ, అన్నప్రసాదాన్ని ప్రతిరోజు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్‌కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, మాలే శ్రవణ్, తమన్నా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### నాచారం డివిజన్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బిఎల్ఆర్



అభివృద్ధి పనులకు కార్పొరేటర్‌తో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

**నాచారం, మే 6 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాచారంలో రూ.63 లక్షల అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీ పార్కులో రూ. 13 లక్షల రూపాయల వ్యయంతో ఓపెన్ జిమ్ కోసం శంకుస్థాపన, అదేవిదంగా రూ. 50 లక్షల రూపాయల వ్యయంతో నాచారం అన్నపూర్ణ కాలనీలోని బేడ బుడగ జంగాల స్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్లు కీర్తి,వినీత్,భారాస నాయకులు, కార్యకర్తలతో పాటు స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాచారం డివిజన్ బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మెకు కార్మికులను అనుమతించాలని వినతి

**సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త:** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనీ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన కార్మికులు పాల్గొనడానికి ఆ రోజు అనుమతించాలని బాలాపూర్ మండల సిఐటియు నాయకులు కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు ఆధ్వర్యంలో నాయకులు కమీషనర్ సరస్వతిని కలిసి వినతి పత్రం, సమ్మె కరపత్రాన్ని అందజేశారు.